క్లుప్తంగా

భక్తులతో పోటెత్తిన సాయిబాబా ఆలయం



నల్లకుంట: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ఆదివారం బాగ్‌అంబర్‌పేటలోని షిరిడీ సాయిబాబా ఆలయం భక్తులతో పోటెత్తింది. ఈ సందర్భంగా బాబాకు ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు. న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకొని శనివారం రాత్రి బాబా ఆలయంలో ప్రత్యేక భక్తి సంగీత కార్యక్రమం నిర్వహించారు.

అయ్యప్ప స్వామి పడిపూజ



పడిపూజలో పాల్గొన్న రమేష్‌యాదవ్, కిషోర్ గురుస్వామి తదితరులు

కాచిగూడ: కాచిగూడ మోతిమార్కెట్‌లో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. అయ్యప్ప స్వాముల భజన కీర్తనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు కన్నె రమేష్‌యాదవ్, కిషోర్ గురుస్వామి, సూరి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ



బతుకమ్మకుంటలో రోడ్డును పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట: డివిజన్‌లో అంతర్గత రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకుంటానని బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బీ.పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. ఆదివారం డివిజన్‌లోని బతుకమ్మకుంట, శ్రీనివాసకాలనీ తదితర ప్రాంతాల్లో ఆమె అధికారులు, స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్‌లో మెజార్టీ ప్రాంతాల్లో రోడ్లు అధ్వనంగా ఉన్నాయని, దశలవారీగా వాటి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో స్థానిక బీజేపీ నేతలు పాల్గొన్నారు.

కుసుమహరనాథ ఆశ్రమంలో సాంప్రదాయ మాసోత్సవం

నల్లకుంట: నల్లకుంట టీఆర్టీ కాలనీలోని కుసుమహరనాథ ఆశ్రమ ప్రాంగణం భక్తులతో పోటెత్తింది. ఆదివారం ఆశ్రమంలో సాంప్రదాయ మాసోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా కుసుమ హరనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులచే నిర్వహించిన భజన ఆకట్టుకుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు.

డైరీ ఆవిష్కరణ

సికింద్రాబాద్: నగరానికి చెందిన ప్రముఖ విబ్సన్ ఫార్మా వార్షిక డైరీని డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్ సీతాఫల్‌మండిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫార్మా రంగంలో అధునాతన మార్పులు రోగులకు మేలు చేకూర్చేలా ఉండాలని ఆకాంక్షించారు. విబ్సన్ ఫార్మా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్, బీఆర్‌ఎస్ నేత సుంకు రామ్‌చందర్, కార్పొరేటర్లు హేమ, సునీత తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం



నాగరాజు

నల్లకుంట: పాల ప్యాకెట్ తీసుకువస్తానని చెప్పి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ కె.ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. ప్రైవేట్ ఉద్యోగి అమరకొండ వేణు విద్యానగర్ మేసీద్ లేన్‌లో ఓ అద్దె ఇంట్లో ఉంటున్నాడు. అతడితో పాటు బావ కరీంనగర్ హుజూరాబాద్ ఆరేపల్లికి చెందిన జమలాపురం నాగరాజు(35) ఉంటున్నాడు. అతనికి బాల్యం నుంచే మానసిక స్థితి సరిగాలేదు. ఈ నెల 1న ఉదయం పాల ప్యాకెట్ తీసుకువస్తానని చెప్పి బయటకు వెళ్లిన నాగరాజు సాయంత్రం వరకు ఇంటికి తిరిగిరాలేదు. దీంతో వేణు నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

- కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించిన ప్రజాప్రతినిధులు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు



ముషీరాబాద్‌లో నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ముఠా జైసింహ, సోమన్

ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచే ప్రధాన ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్నేహితులు, బంధువులు ఒకరినొకరు కలుసుకొని నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకున్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తన అనుచరులతో కలిసి తిరుమల వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. వైఎస్‌ఆర్‌టీపీ నాయకుడు మహ్మద్‌గౌడ్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ జహంగీర్‌యాదవ్ బారీ కేక్ కట్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ఆధ్వర్యంలో బీసీ భవన్‌లో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు.

బీఆర్‌ఎస్ నాయకుడు సోమన్ ఆధ్వర్యంలో..

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో బీఆర్‌ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకుడు టి.సోమన్ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్‌ఎస్ గ్రేటర్ యువజన విభాగం నాయకుడు ముఠా జైసింహ కేక్ కట్ చేసి టపాసులు కాల్చి వేడుకలను ప్రారంభించారు. నూతన సంవత్సరంలో ప్రజలందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. అనంతరం ముఠా జైసింహను సోమన్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు డి.శివముదిరాజ్, దీన్ దయాల్‌రెడ్డి, డివిజన్ మహిళా కమిటీ అధ్యక్ష కార్యదర్శులు శోభ, మేరీ, నాయకుడు భిక్షపతియాదవ్, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటలో..

అంబర్‌పేట: అంబర్‌పేట నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డికి బ్రహ్మకుమారీస్ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం ఆయన నివాసంలో కలిసి స్వీట్లు పంచి శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి కేటీఆర్‌కు శుభాకాంక్షలు..

కాచిగూడ: మున్నూరుకాపు సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్.వి.మహేందర్‌కుమార్ ఆధ్వర్యంలో సంఘం నేతలు, బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు ఆదివారం మంత్రి కేటీఆర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నేతలు ఆకుల రవీందర్‌రావు, నర్సింగ్‌రావు, ప్రవీణ్, రంగారావు, పురుషోత్తం, శంకర్, లక్ష్మణ్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ ఆధ్వర్యంలో అరుంధతీనగర్‌లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కలిసి కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో గుర్రం చంద్రకళ, రమేష్, ఆలియా, శ్రీకాంత్, లావణ్య, మీనా, యాదమ్మ, లక్ష్మమ్మ, ఎల్లమ్మ, భీమయ్య, పుష్ప, పద్మ తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌కు శుభాకాంక్షలు చెబుతున్న ఐఆర్‌సీఎస్ చైర్మన్ భీమ్‌రెడ్డి, ఐజాక్‌రాజ్



బీసీ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న ఆర్.కృష్ణయ్య



తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్



వైఎస్‌ఆర్‌టీపీ నాయకుడు మహ్మద్ గౌస్ ఆధ్వర్యంలో..



కేక్ కట్ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు గుర్రం శంకర్, చంద్రకళ

కేలండర్ ఆవిష్కరణ

అంబర్‌పేట: కృష్ణయాదవ్ యువసేన ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను మాజీ మంత్రి కృష్ణయాదవ్ ఆవిష్కరించారు. ఆదివారం ఛేనంబరు చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో ఆయన కేలండర్‌ను ఆవిష్కరించి ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువసేన నాయకులు తూర్పు రాంచందర్, నరేందర్, సునీల్ యాదవ్, భాస్కర్‌యాదవ్, సోను, రాముయాదవ్, దడిగె జగన్‌యాదవ్, రాము, ఆర్.కె.బాబు తదితరులు పాల్గొన్నారు.

వివేక్‌నగర్‌లో..

చిక్కడపల్లి: జ్యోతిష్యుడు, అర్చకుడు బుగ్గ లక్ష్మీపతి శర్మ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి దేవాలయంలో నిర్వహించారు. దేవాలయ చైర్మన్ జి.మురళీప్రసాద్, కార్యనిర్వహణాధికారి మాచర్ల దేవనాథం కేలండర్‌ను ఆవిష్కరించారు.



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి కృష్ణయాదవ్

కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలి

చిక్కడపల్లి: నూతన సంవత్సరం సందర్భంగా టీపీసీసీ వర్కింగ్ ప్రసిడెంట్ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్‌ను కలిసి ముషీరాబాద్ యువజన కాంగ్రెస్ కార్యదర్శి అభిషేక్ కెన్నడీ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలు కృషిచేయాలని అంజన్ పిలుపునిచ్చారని అభిషేక్ తెలిపారు. కార్యక్రమంలో గాంధీనగర్ కాంగ్రెస్ నాయకులు సంపత్, గిరి పాల్గొన్నారు.

ముదిరాజ్‌ల ఐక్యతకు రాష్ట్ర వ్యాప్త సమావేశాలు

ముషీరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా ముదిరాజ్‌ల ఐక్యతకు త్వరలో నియోజకవర్గాలవారీగా సమావేశాలు నిర్వహించనున్నట్లు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ అన్నారు. ముషీరాబాద్‌లోని ముదిరాజ్ సంఘం కార్యాలయంలో నూతన సంవత్సర కేలండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కాసాని మాట్లాడుతూ.. ముదిరాజ్‌లు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రాణించాలన్నారు. ముదిరాజ్‌ల హక్కుల సాధనకై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో ముషీరాబాద్ నియోజకవర్గ ముదిరాజ్ సంఘం చైర్మన్ డి.శివముదిరాజ్ అధ్యక్షులు సదా తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం..

హిమాయత్‌నగర్: నూతన సంవత్సరం సందర్భంగా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి విస్తృత పర్యటన చేశారు. ఆదివారం పలు దేవాలయాల వద్ద ఆమె అన్నదాన కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహించారు. అనంతరం కార్యకర్తలు రూపొందించిన కేలండర్‌లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యలను ఒక్కోటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అన్నదానం మహా పుణ్యకార్యమని.. ఆకలిలో ఉన్న వారికి పట్టెడన్నం పెట్టి ఆకలి తీర్చితే అందులో ఎంతో తృప్తి ఉంటుందన్నారు. ఈ ఏడాదిలో కూడా ప్రజలకు మరింత దగ్గర అవుతూ డివిజన్‌ను అభివృద్ధి పథంలో నడిపించేందుకు తాను ప్రయత్నిస్తానని తెలిపారు.



అన్నదాన కార్యక్రమంలో కార్పొరేటర్ దంపతులు

ఓయూ పూర్వ విద్యార్థులకు హాస్టల్ భోజనాలు

ఉస్మానియా యూనివర్సిటీ: గ్లోబల్ అలుమ్ని మీట్-2023లో భాగంగా ఓయూ పూర్వవిద్యార్థులకు భోజన సదుపాయాన్ని క్యాంపస్‌లోని వివిధ హాస్టళ్లలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆదివారం అధికారులు తెలిపారు. ఈ నెల 3, 4 తేదీల్లో జరిగే కార్యక్రమంలో 4న మధ్యాహ్నం భోజనాన్ని ఆయా హాస్టళ్ల మెస్సులలో ప్రస్తుత విద్యార్థులతో కలిసి తినేలా ఏర్పాటు చేశామన్నారు. హాస్టళ్లలో జరిగిన నాటి మధుర జ్ఞాపకాలను పూర్వవిద్యార్థులు నెమరవేసుకొని పంచుకునేలా పాతబడి మూసివేసిన ఏ, బీ హాస్టల్ భవనాలను తెరువనున్నారు.

మురుగు సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించండి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ ప్రాంతవాసులను ఎంతో కాలంగా వేధిస్తున్న మురుగు నీటి సమస్యను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ విజయారెడ్డి కోరారు. సచివాలయ నిర్మాణ పనుల కారణంగా మింట్ కంపౌండ్, సచివాలయం గుండా వెళ్లే పైప్‌లైన్ బ్లాక్ అవడం, వాటర్ వర్క్స్ ఆఫీసు నుంచి ఇందిరానగర్ కాలనీ డబుల్ బెడ్‌రూం గుండా ఐమ్యాక్స్ పక్కన ఖాళీ స్థలం నుంచి ఎన్టీఆర్ గార్డెన్ వరకు వెళ్లే నాలా ఐమ్యాక్స్ పక్కన ఖాళీ స్థలంలో కార్ రేస్ గురించి చేపడుతున్న నిర్మాణాల కారణంగా ఆగిపోవడంతో ఖైరతాబాద్ ప్రాంత వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాటర్‌వర్క్స్ అధికారులు ఈ పైప్‌లైన్లను శిథిలం అవకుండా, సమస్య పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదివారం విజయారెడ్డి ఘటన స్థలాన్ని పరిశీలించి అనంతరం తెలిపారు.



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న విజయారెడ్డి

5న కంటోన్మెంట్ బోర్డు సమావేశం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బోర్డు సమావేశం గురువారం జరగనుంది. ఈ మేరకు అధికారులు వెల్లడించారు. సీఈఓ మధుకర్ నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించిన దాదాపు రెండు నెలలు పూర్తి కావస్తుండగా, ఆయన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తొలి సమావేశం ఇది కావడం గమనార్హం. పూర్తిస్థాయి పాలకమండలి రద్దు అయ్యి దాదాపు రెండేళ్లు అవుతున్నా ఇప్పటికీ ఎన్నికల ఊసే లేదు. ఇద్దరు అధికారులు, సివిలియన్ నామినేటెడ్ సభ్యుడితో కూడిన ముగ్గురు సభ్యుల వేరీడ్ బోర్డు ఆధ్వర్యంలో పాలన సాగుతోంది. ఈ క్రమంలోనే రెండేళ్లపాటు సీఈఓగా పనిచేసిన అజిత్‌రెడ్డి బదిలీ కాగా ఆయన స్థానంలో నూతన సీఈఓగా మధుకర్ నాయక్ పదవీ బాధ్యతలు స్వీకరించారు. సీఈఓలు మారిన ప్రతీసారీ బోర్డు పాలనలో తమదైన మార్పును చూపిస్తూ రావడం జరుగుతోంది. ఈ నేపథ్యంలో గురువారం నాటి సమావేశం తీరుతెన్నులపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.

డ్రైనేజీ పైప్‌లైన్ పనుల ప్రారంభం

రసూల్‌పురా: కోమటి నాగయ్య గల్లీ, రావీ చెట్టు గల్లీ, ట్రాన్స్‌ఫార్మర్ గల్లీల్లో బోర్డు నిధులతో చేపట్టే భూగర్భ డ్రైనేజీ పైప్‌లైను పనులను బోర్డు నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రసూల్‌పురాను దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని మాటిచ్చిన కేసీఆర్ మరచిపోయాడని కాని బీజేపీ మాట ఇవ్వకుండానే పలు అభివృద్ధి పనులను చేపడుతోందని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మాదారపు అశోక్, జై యాదవ్, లక్ష్మణ్, ప్రశాంత్, ప్రభు, స్థానికులు పాల్గొన్నారు.



వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: చిక్కడపల్లిలోని వెంకటేశ్వరస్వామి దేవాలయంలో సోమవారం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో రామాంజనేయులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులకు దైవదర్శనం ఉంటుందన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. బారికేడ్లను ఏర్పాటు చేయడంతో పాటు పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన వెల్లడించారు.

న్యూరామాలయంలో..

నల్లకుంట: వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని సోమవారం(నేడు) న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయంలో ప్రత్యేక పూజలు ఉంటాయని ఆలయ కార్యనిర్వాహణ అధికారిణి కె.జయంతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఉంటుందన్నారు. భక్తులు కోవిడ్-19 నిబంధనలు పాటిస్తూ ఇష్టదైవాలను దర్శించుకోవాలని ఈవో సూచించారు. బాగ్‌అంబర్‌పేటలోని సాయిబాబా మందిరంలో ఉదయం 8 గంటల నుంచి మహావిష్ణువు సహస్రనామస్తోత్ర పారాయణం ఉంటుందని షిరిడీ సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు.

వీరభద్రస్వామి కల్యాణోత్సవానికి సహకారం అందిస్తాం

కాచిగూడ: వీరభద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 22న కాచిగూడలోని మున్నూరుకాపు భవన్‌లో నిర్వహించనున్న వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవానికి సహకారం అందించనున్నట్లు మున్నూరుకాపు న్యాయవాదులు ప్రకటించారు. కాచిగూడలోని తెలంగాణ రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ కార్యాలయంలో మహాసభ అధ్యక్షుడు, న్యాయవాది మణికొండ వెంకటేశ్వర్‌రావు ఆధ్వర్యంలో మున్నూరుకాపు న్యాయవాదుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులను వీరభద్రస్వామి సేవా సమితి అధ్యక్షుడు షాబాద్ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్ సత్కరించారు. కార్యక్రమంలో న్యాయవాదులు కొండూరు వినోద్‌కుమార్, కానుగు దేవేందర్, గోపిశెట్టి నరేందర్, పల్లె ప్రమోద్, దేవరశెట్టి విజయానంద్, మంగు ఆనంద్ పాల్గొన్నారు.

'భార్యాబాధితులకు న్యాయం జరగడం లేదు'



సమావేశంలో మాట్లాడుతున్న బాలాజీరెడ్డి

సుందరయ్యవిజ్ఞానకేంద్రం: దేశంలో ఎక్కడికి వెళ్లినా భార్యల వేధింపులతో నష్టపోతున్న భర్తలకు న్యాయం జరగడం లేదని భార్యాబాధితుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జి.బాలాజీరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాలాజీరెడ్డి మాట్లాడుతూ.. భార్యాబాధితులు కేసులు పెడితే పట్టించుకోని పోలీసులు భార్యలు తప్పుడు కేసులు పెట్టినా స్పందిస్తున్నారన్నారు. మెయింటెనెన్స్, డొమెస్టిక్ వాయిలెన్స్ చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భర్త నుంచి విడిపోయిన భార్యలు భర్తల ఇంటి పేర్లను వాడకూడదన్నారు. చట్టాలను కఠిన తరం చేసి భార్యాబాధితులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శివరామకృష్ణ, శ్రీనివాస్, వెంకటరమణ, రాజేష్, చందు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ మఠంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న లయన్ విద్యాసాగర్, హిప్నో పద్మాకమలాకర్

కవాడిగూడ: ప్రజలందరూ సమానమేనని రెడ్‌క్రాస్ సొసైటీ, స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం జిల్లా చైర్‌పర్సన్ లయన్ విద్యాసాగర్ అన్నారు. కల్పతరు, ప్రపంచ కుటుంబ దినం సందర్భంగా ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రామకృష్ణ మఠం బాలల సేవా విభాగంలో మహారాజ్ రఘునందన్, డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్, జి.కృష్ణవేణిల ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హిప్నో పద్మాకమలాకర్ మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంస్కృతులు, మతాలు భిన్నంగా ఉండవచ్చని, మానవ జాతి అంతా ఒక కుటుంబమని ఆమె అన్నారు. ఈ పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులతో పాటు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బిస్కెట్లు, కేక్, పండ్లు పంపిణీ చేశారు.

మృతిచెందిన సినీ నటులకు నివాళి



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

చిక్కడపల్లి: కళానిలయం సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం చిక్కడపల్లిలోని గానసభలోని హనుమంతరావు కళావేదికలో పోయినోళ్లంతా మంచోళ్లు పేరిట జరిగిన కార్యక్రమంలో 2022 సంవత్సరంలో మృతిచెందిన సినీ ప్రముఖులను స్మరిస్తూ నివాళులర్పించారు. విశ్రాంత పోలీసు అధికారి సుంకరి సత్యనారాయణ మాట్లాడుతూ.. బాలీవుడ్ గాయని లతామంగేష్కర్ నుంచి తెలుగు నటులు కృష్ణంరాజు, కృష్ణ, సత్యనారాయణ, చలపతిరావు, గీత రచయిత కందికొండ తదితరులను స్మరించుకోవడం సంస్కారవంతంగా ఉందన్నారు. నిర్వాహకులు సురేందర్ మాట్లాడుతూ.. 2022లో మృతిచెందిన కృష్ణ, సత్యనారాయణ, చలపతిరావు, రమేష్ బాబు, కృష్ణంరాజు నటించిన కురుక్షేత్రం సినిమాను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కవి చిక్కా దేవదాసు పాల్గొన్నారు.

చిలకలగూడ ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన జీడీఎక్స్ ప్రతినిధులు



గాంధీఆస్పత్రి: గాంధీఆస్పత్రిలో శానిటేషన్, సెక్యూరిటీ సేవలు అందిస్తున్న జీడీఎక్స్ సెక్యూరిటీ అండ్ ఫెసిలిటీ మేనేజ్‌మెంట్ సర్వీసెస్ ప్రతినిధులు ఆదివారం చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ నరేష్‌ను కలిసి పలు అంశాలపై చర్చించారు. గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో సెక్యూరిటీ వ్యవస్థ మరింత కట్టుదిట్టం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తామన్నారు. నేరాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సెక్యూరిటీగార్డులకు దశలవారీగా శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. అనంతరం నరేష్‌కు పుష్పగుచ్ఛం అందించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీడీఎక్స్ ప్రతినిధి రవికుమార్, మేనేజర్ బాబురావు, సెక్యూరిటీ ఇన్‌చార్జి శివాజీ, సూపర్‌వైజర్ కార్తీక్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడిగా పిడమర్తి రవికి అవకాశం ఇవ్వండి



ఉస్మానియా యూనివర్సిటీ: బీఆర్‌ఎస్‌కు రాష్ట్ర అధ్యక్షుడిగా పిడమర్తి రవికి అవకాశం ఇవ్వాలని తెలంగాణ మాదిగ జేఏసీ రాష్ట్ర కో ఆర్డినేటర్ బోరెల్లి సురేష్ ఆ పార్టీ జాతీయ నేత, రాష్ట్ర సీఎం కేసీఆర్‌ను కోరారు. ఆదివారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. చిన్న నాటి నుంచి విద్యార్థి నేతగా పోరాడిన పిడమర్తి రవి బీఆర్‌ఎస్ అధ్యక్షపదవికి అర్హుడన్నారు. గతంలో రెండు సార్లు ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా, రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు పిడమర్తి రవికి అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్ ఈసారీ బీఆర్‌ఎస్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి వివిధ జిల్లాకు చెందిన మాదిగ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి

చిక్కడపల్లి: టిప్పర్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో చోటుచేసుకుంది. శనివారం సాయంత్రం ఆర్టీసీ క్రాస్‌రోడ్ మీదుగా ఇందిరాపార్క్ వైపు వెళ్తుండగా ప్రమాదం జరిగింది. చిక్కడపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. మృతుడి వయసు 35 నుంచి 45 ఏళ్లు ఉంటుందని తెలిపారు. టిప్పర్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.